సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం | 30 | మార్చి | 2024



వడదెబ్బతో జాగ్రత్త
అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున వడదెబ్బకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

II లో



8,970 క్యూసెక్కుల విడుదల
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 6.95 అడుగులుగా ఉంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సెహరీ ఆది (ఉ॥)
రాజమహేంద్రవరం	6.25	4.37
కాకినాడ	6.24	4.37
అమలాపురం	6.24	4.37

న్యూస్‌రీల్

డిపాజిట్ దక్కలేదంటే?
అంబాజీపేట: ఎన్నికల్లో పోటీ చేసే నాయకులకు డిపాజిట్ దక్కలేదంటే ఆ అవమానం భరించలేనిది. మరి ఇంతకీ డిపాజిట్ దక్కడమంటే ఏమిటంటే.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో జనరల్ కేటగిరీ వారైతే రూ.10 వేలు, రిజర్వేషన్ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్‌గా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద చెల్లించాల్సి ఉంటుంది. సదరు అభ్యర్థికి తాను పోటీ చేసిన నియోజకవర్గంలో పోలై చెల్లిన ఓట్లలో 6 శాతం రావాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక నియోజకవర్గంలో లక్ష చెల్లిన ఓట్లు పోలైతే 6వేల ఓట్లు వస్తే డిపాజిట్ దక్కినట్లుగా నిర్ధారిస్తారు. అంతకు ఒక్క ఓటు తగ్గినా డిపాజిట్ గల్లంతు అయినట్లు లెక్క. డిపాజిట్ దక్కని పక్షంలో నామినేషన్ దాఖలు చేసిన సమయంలో ఎన్నికల అధికారి వద్ద డిపాజిట్ చేసిన ధరావత్తు సొమ్మును అధికారులు జప్తు చేస్తారు. డిపాజిట్ దక్కించుకున్న వారికి ఎన్నికల తర్వాత గెజిట్ పబ్లికేషన్ పూర్తికాగానే డిపాజిట్ నగదును సదరు అభ్యర్థికి తిరిగి చెల్లిస్తారు.

ఓటు హక్కు వినియోగానికి పక్కాగా ఏర్పాట్లు
కలెక్టర్ హిమాన్షు శుక్లా



కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా తమ హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం పక్కాగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో కీలకం కానున్న అధికారులలో జిల్లా కలెక్టర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఆర్వోగా, జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ సెక్టార్, ప్రిసైడింగ్ అధికారులు బీఎల్‌ఓలు ముఖ్యమేనని, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో రిటర్నింగ్ అధికారులు ఎన్నికల విధుల్లో కొనసాగుతున్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ పూర్తయి ఫలితాలు వెలువడే వరకు రిటర్నింగ్ అధికారులే కీలక పాత్ర పోషిస్తారన్నారు. వీరితో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల బాధ్యత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా, రాజకీయ పార్టీల అభ్యర్థులు కోడ్ అతిక్రమించకుండా పర్యవేక్షించేందుకు ఎన్నికల కమిషన్ వీరికి ప్రత్యేక అధికారాలను అప్పగించిందన్నారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించడం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, అభ్యర్థుల నామినేషన్ పత్రాల దాఖలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు బూత్ లెవల్ అధికారుల నుంచి జిల్లా ఎన్నికల అధికారుల వరకు ప్రత్యేక బాధ్యతలు నిర్వర్తిస్తారన్నారు.

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ



నన్నయ వర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న ముఖేష్ కుమార్ మీనా, కలెక్టర్ మాధవీలత, ఇతర అధికారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): లాలాచెరువు సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఇక్కడ భద్రపరిచామని కలెక్టర్ కె.మాధవీలత ఈ సందర్భంగా ఆయనకు తెలిపారు. వాటి భద్రతకు తీసుకున్న చర్యలను వివరించారు. గోడౌన్ నుంచి ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు చెందిన తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు తరలించే విధానంపై సీఈఓ సమీక్షించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. ఈవీఎం గోడౌన్‌లోని రిజిస్టర్‌లో ముఖేష్ కుమార్ మీనా సంతకం చేశారు. ఆయన వెంట ఎస్పీ పి.జగదీష్ తదితరులున్నారు. తొలుత రాజమహేంద్రవరం చేరుకున్న ఆయనకు కలెక్టర్ మాధవీలత, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి స్వాగతం పలికారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూములను ముఖేష్ కుమార్ మీనా పరిశీలించారు. ఈ ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ పూర్తయిన వెంటనే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఈవీఎంలను, ఇతర అనుబంధ యూనిట్లను ఇక్కడకు తీసుకుని వచ్చి, నియోజకవర్గాల వారీగా కేటాయించిన స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తామని కలెక్టర్ ఆయనకు వివరించారు. ఈ విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ కూడా అమలు చేస్తున్నామని చెప్పారు.

జెండలు జత కట్టినా.. పట్టని క్యాడర్





- టీడీపీ... జనసేనల మధ్య పొడవని పొత్తులు
- ఇన్‌చార్జిల పక్క చూపులు
- రెబల్స్‌గా పోటీకి సిద్ధమవుతున్న కొందరు
- పార్టీలలో ఉన్నా ప్రచారానికి మరికొందరు దూరం
- డీఎంఆర్ వర్గాన్ని అవమానించిన నాగబాబు

సాక్షి అమలాపురం: టీడీపీ, జనసేనల ఆశావహులు రగిలిపోతున్నారు. పార్టీల కోసం ఏళ్ల పాటు జెండాలు మోస్తే ఎన్నికల సమయంలో పొత్తుల పేరుతో పక్కనబెట్టడమే కాకుండా... భంగపడ్డవారిని ఊరడించడం పోయి అడుగడుగునా అవమానిస్తుండడంతో వారు మండిపడుతున్నారు. ఆయా పార్టీల అధిష్టానాలతో తాడోపేడో తేల్చుకొనేందుకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగానే జిల్లాలో జనసేన తరపున ఒక వికెట్ పడింది. ముమ్మిడివరానికి చెందిన ప్రముఖ శెట్టిబలిజ నాయకుడు, జనసేన ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ ఆ పార్టీకి రాజీనామా ప్రకటించారు. మరికొంతమంది జనసేన, టీడీపీ ఇన్‌చార్జిలు ఇదే బాటలో పయనిస్తుండగా, మరి కొందరు పార్టీలలోనే ఉంటున్నా మిత్రపక్షం ప్రచారానికి దూరంగా ఉంటున్నారు.

ప్రచారానికి దుమ్మా

కోనసీమ జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య పొత్తు పొడిచినా సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపిక జరిగినా క్షేత్రస్థాయిలో ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య పొత్తులు కుదరలేదు. జిల్లా అంతా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. టీడీపీకి కేటాయించిన చోట జనసేన ఇన్‌చార్జిలు, పార్టీలో కీలక నాయకులు, జనసేనకు ఇచ్చిన చోట టీడీపీ క్యాడర్ ఒకరికి ఒకరు సహకరించడం లేదు. ఒక్క సీటు కూడా ఇవ్వనందుకు బీజేపీ క్యాడర్ అలిగి కూర్చుంది. అక్కడక్కడా తప్పదని కలిసి ఉన్నట్టు ఫొటోలకు పోజులిచ్చినా.. ఎవరికి వారే అన్న రీతిలో ఉంది. టీడీపీ అభ్యర్థుల ప్రచారానికి జనసేన ఇన్‌చార్జిలు దుమ్మా కొడుతున్నారు. మండపేటలో జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. 'నాతో పాటు, పార్టీ క్యాడర్ సొంత సొమ్ము వెచ్చించి అన్ని విధాలుగా నష్టపోయామని చెప్పుకొచ్చారు. పవన్ తమకు న్యాయం చేస్తేనే ప్రచారానికి వెళతానని లీలాకృష్ణ ప్రకటించినా పార్టీ నుంచి స్పందన లేదు. దీంతో ఆయన టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. రామచంద్రపురంలో టీడీపీకి ఇన్‌చార్జిగా ఉన్న రెడ్డి సుబ్రహ్మణ్యం (ఆర్ఎస్)ను కాదని వాసంశెట్టి సుభాష్‌కు పార్టీ సీటు ఇచ్చింది. నాటి నుంచి ఆర్ఎస్ ఈ నియోజకవర్గానికి దూరంగా ఉంటుండగా, కొత్తగా పార్టీలో చేరిన రేవు శ్రీను సైతం ప్రచారానికి వెళ్లడం లేదు. జనసేన ఇన్‌చార్జిగా ఉన్న పోలిశెట్టి చంద్రశేఖర్ టీడీపీ ప్రచారం వైపు కన్నెత్తి చూడడం లేదు. పొత్తు ధర్మం పాటిస్తామని చెబుతున్నారు కానీ ప్రచారానికి మాత్రం రావడం లేదు. అమలాపురంలో టీడీపీకి చెందిన పరమట శ్యామ్‌కుమార్ రెబల్‌గా పోటీకి సిద్ధమవుతున్నారు. కొత్తపేటలో సోదరులైన టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందం, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావుల మధ్య సఖ్యత కుదిరినా అందంతా ప్రకటనలకే అన్నట్టుగా ఉంది. జనసేన పోటీ చేస్తున్న రాజోలు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న గొల్లపల్లి సూర్యారావు పార్టీని వదిలిపోయారు. వైఎస్సార్ సీపీలో చేరి రాజోలు నుంచి పోటీ చేస్తున్నారు. పి.గన్నవరంలో టీడీపీకి ఇన్‌చార్జి లేకున్నా ఇక్కడ నుంచి సీటు ఆశించిన టీడీపీ ఆశావహులు జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు దూరంగా ఉంటున్నారు.

సీటు పోయే... పరువూ పోయే..

జనసేన అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి డి.ఎం.ఆర్.శేఖర్‌కు సీటు రాలేదు సరికదా, పార్టీ అధిష్టానం నుంచి డీఎంఆర్ వర్గం అవమానాన్ని చవి చూడాల్సి వచ్చింది. ఆ వర్గానికి చెందిన నాయకులు ఇటీవల పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ సోదరుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబును కలిశారు. అమలాపురంలో డీఎంఆర్, శెట్టిబత్తుల రాజబాబు వర్గాల ఆధిపత్య ధోరణి వల్ల పార్టీ పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయిందని మండిపడినట్టు సమాచారం. అమలాపురంలో రెండువర్గాలు కలిసి పార్టీని దెబ్బతీశాయనడంతో వారు అవాక్కయ్యారు. చంద్రబాబు ఒత్తిడికి లొంగి ఈ సీటును టీడీపీకి వదిలింది పవన్ అయితే నెపాన్ని పార్టీ క్యాడర్ మీద నెట్టివేయడాన్ని రెండు వర్గాల వారు జీర్ణించుకోలేకపోతున్నారు. టీడీపీ అభ్యర్థి ఆనందరావు నిర్వహిస్తున్న ప్రచారానికి వీరిద్దరూ దూరంగా ఉంటున్నారు. పై నుంచి వచ్చిన ఒత్తిడితో రెండు వర్గాల నాయకులు అమలాపురంలో శుక్రవారం సమావేశమై టీడీపీకి మద్దతు ప్రకటించారు. 'మా పార్టీ అధిష్టానం నుంచి వస్తున్న ఒత్తిడితో టీడీపీతో పొత్తుకు 'మమ' అనక తప్పడం లేదు. పార్టీలో ఉండేదెవరో... పోయేదెవరో చూడాల్సి ఉంది' అని నియోజకవర్గానికి చెందిన కీలక జనసేన నేత వ్యాఖ్యానించడం గమనార్హం.

జనసేనకు పితాని షాక్
బీసీ వర్గానికి చెందిన శెట్టిబలిజ నేత, ముమ్మిడివరం జనసేన ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ జనసేనకు శుక్రవారం రాజీనామా ప్రకటించారు. ఇక్కడ నుంచి గత ఎన్నికలలో పోటీ చేసిన బాలకృష్ణ ఓటమి చెందినా పార్టీ జెండా మోస్తూ వచ్చారు. ప్రస్తుత ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేతి చమురు వదుల్చుకున్నారు. పార్టీ సీటు ఇవ్వలేదు సరికదా, పవన్‌ను కలిసినా రాజకీయంగా గుర్తింపు విషయంలో నమ్మకమైన హామీ దక్కలేదు. దీంతో ఆయన పార్టీని వదిలి వైఎస్సార్ సీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. జనసేనను ఓడిస్తానని శపథం చేశారు. ఆయనతోపాటు ఉమ్మడి జిల్లాలో మరో బీసీ నేత, కాకినాడ మాజీ మేయర్ సరోజ ఇప్పటికే పార్టీని వీడిన విషయం తెలిసిందే.

భగ్గుమంటున్న రాజబాబు వర్గం
మరోవైపు శెట్టిబత్తుల రాజబాబు సైతం సీటు రానందుకు పార్టీపై ఆగ్రహంతో ఉన్నారు. పి.గన్నవరం అసెంబ్లీకి తొలుత టీడీపీ పోటీ చేస్తుందని ప్రకటించడంతో అమలాపురం నుంచి జనసేనకు అవకాశం వస్తుందని ప్రచారం జరిగింది. రాజబాబుకు సీటు ఖరారైందని ఆయన వర్గం అమలాపురం గడియారస్తంభం సెంటరులో బాణసంచా కాల్చారు. తీరా ఈ సీటు టీడీపీకి కేటాయించడంతో రాజబాబు వర్గం భగ్గుమంటోంది. సీటు కోల్పోవడంతో ఇక్కడే తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. దీనికితోడు టీడీపీ అభ్యర్థి ఆనందరావును సొంత పార్టీలో అసంతృప్తులను, జనసేనను కలుపుకుని పోవాలని అధిష్టానం సూచించినా పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇది కూడా రెండు పార్టీల మధ్య అగాధాన్ని సృష్టిస్తోంది. 'అధినేతల మధ్య పొత్తు కుదిరింది కాని. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తల మధ్య సఖ్యత కుదరడం లేదు. ఇదే ఎన్నికలలో మా పార్టీల కొంప ముంచనుంది' అని రెండు పార్టీల క్యాడర్ వాపోతోంది.

ప్రతిపక్షాల జిత్తులకు జనం మోసపోరు

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి రాపాక, ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి
- ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నేతలు



అయినవిల్లి మండలం పొట్టిలంకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వర ప్రసాదరావు, వేణుగోపాలరావు

అయినవిల్లి: ప్రతిపక్షాలు ఎన్ని పొత్తులు, జిత్తులు, ఎత్తులు వేసినా, కుయుక్తులు పన్నినా మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని, రాష్ట్ర ప్రజలు వారి మోసాలకు తలొగ్గరని వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద రావు, పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో అయినవిల్లి మండలం పొట్టిలంక గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని తూర్పు సెంటిమెంట్‌గా ప్రారంభించారు. స్థానికంగా ఉన్న విఘ్నేశ్వరుని ఆలయంలోను, గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలోను ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్నికల ప్రచారంలో వారికి మహిళలు అడుగు అడుగునా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాపాక, విప్పర్తి మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు వేటు వేసి మరోసారి రాష్ట్రంలో సంక్షేమ పాలనకు స్వాగతం పలకాలన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా100శాతం సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కులం, మతం, పార్టీ తారతమ్యాలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉన్న గ్రామంలోనే అన్ని సేవలు అందే విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించి ప్రతిపక్షాలు మాట్లాడడానికి లేనివిధంగా అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎన్నికల పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాస రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ నీతిపూడి స్టాలిన్‌బాబు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంధం రవికుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం సంయుక్త కార్యదర్శి తులా గోపాలకృష్ణ, జిల్లా విద్యార్థి విభాగం నాయకులు మిండగుదిటి శిరీష్ నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం, అంబాజీపేట మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, విత్తనాల ఇంద్రశేఖర్, అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి తాతాజీ, కోర్లపాటి కోటబాబు, మట్టపర్తి వెంకటరమణ(పండు) పాల్గొన్నారు.

కూటమితో కాపులకు అన్యాయం

- 2014 కూటమి ప్రభుత్వంలో నష్టమే పునరావృతం
- ఏపీ ప్రభుత్వ అగ్రిమిషన్ మెంబర్ బాబి



జిన్నూరి బాబి

అమలాపురం టౌన్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో రాష్ట్రంలోని కాపులకు తీరని అన్యాయం జరుగుతోందని ఏపీ రాష్ట్ర అగ్రి మిషన్ మెంబర్ జిన్నూరి రామారావు (బాబి) స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో ఐదు ఎంపీ స్థానాల్లో కాపు అభ్యర్థులను బరిలో దింపితే అదే టీడీపీ, జనసేన చెరో పార్లమెంట్ స్థానానికి కాపు అభ్యర్థులను పరిమితం చేశాయని చెప్పారు. అమలాపురంలో బాబి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అదే కూటమి భాగస్వామ్య పార్టీ బీజేపీ ఒక్క పార్లమెంట్ స్థానంలోనూ కాపులకు టిక్కెట్ ఇవ్వలేదన్నారు. కూటమి వల్ల ఈ ఎన్నికల్లో ఆదిలోనే కాపులకు అన్యాయం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. 2014–19 మధ్య రాష్ట్రంలో ఇవే పార్టీల కూటమి ప్రభుత్వాన్ని పాలించినప్పుడు కాపులను బీసీలో చేర్చుతామన్నారు. కాపుల సంక్షేమానికి కార్పొరేషన్ ద్వారా రూ.వెయ్యి కోట్లు వెచ్చిస్తానని హామీలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ రెండు హామీలను అప్పట్లో కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు సరికదా వాటికోసం ప్రశ్నిస్తే కాపులకు పోలీసు కేసులు బహుమానంగా ఇచ్చారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే కాదు, పార్టీలోనూ కాపులకు సముచిత స్థానం ఇచ్చిన విషయాన్ని బాబి స్పష్టం చేశారు. కాపులకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఆ కూటమి ప్రభుత్వంలో కంటే అధికంగా చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. 2014–19 కూటమి ప్రభుత్వంలో కాపులకు జరిగిన అన్యాయాలే ఇప్పుడు ప్రస్తుత ఎన్నికల పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల ప్రకటన నుంచే మొదలయ్యాయని చెప్పారు. నాటి ప్రభుత్వంలో కాపులకు జరిగిన నష్టాలే ఇప్పుడు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని బాబి విజ్ఞప్తి చేశారు.

సకాలంలో స్పందించిన అధికారులు



ఓఎన్జీసీ పైపులైన్ ద్వారా సాగునీటిని సరఫరా చేస్తున్న దృశ్యం



పి.మల్లవరం పంచాయతీ శివారు భూములకు ఇంజిన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

- సాగునీటి సరఫరాకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు
- ఓఎన్జీసీ పైపులైన్ ద్వారా పంట పొలాలకు సరఫరా
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ శివారు భూములకు సాగునీరు అందడం లేదంటూ రైతన్నలు ఆందోళన చేయగా అధికార యంత్రాంగం సకాలంలో స్పందించింది. ఇరిగేషన్ ఉన్నతాధికారులతోపాటు రెవెన్యూ అధికారులు సైతం నీరులేక ఎండిపోతున్న వరి చేలను స్వయంగా వచ్చి పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్, కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. రబీ పంట చివరి దశలో ఉన్న నేపథ్యంలో మరో 20 రోజులపాటు నీటిని సరఫరా చేయగలిగితే ఈ సమస్య నుంచి బయటపడవచ్చని, ఈ పరిధిలో ఉన్న ఓఎన్జీసీ పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తే సమస్యకు పరిష్కారం వస్తుందని చెప్పడంతో ఆ మేరకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ఓఎన్జీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి, నీటిని సరఫరా చేసేందుకు ఒప్పించారు. దీంతో ఆయా పరిధిలో ఉన్న ఓఎన్జీసీ పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, డీఈ జి.రత్నప్రభ, ఏఈ ఈశ్వర్‌లతోపాటు గ్రామ రెవెన్యూ అధికారులు దగ్గరుండి ఓఎన్జీసీ పైపులైన్ వాల్వును ఓపెన్ చేసి నీటిని పంట పొలాలకు విడుదల చేశారు. అదేవిధంగా సాగునీటి ఎద్దడి నివారణకు విద్యుత్ మోటార్లను సైతం ఏర్పాటు చేసి శివారు ప్రాంతాలకు నీరు చేరేవిధంగా చర్యలు చేపట్టారు. దీంతో నీరు వరిచేలలోకి ప్రవేశించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై తక్షణమే స్పందించి నివారణా చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగానికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏటా రబీకి సాగునీటి ఇబ్బంది తలెత్తుతోందని, దీనికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

148 గ్రాముల ఆభరణాల రికవరీ



బంగారు ఆభరణాలు, నిందితుడితో సీఐ శ్రీనివాస్, సిబ్బంది

కాకినాడ రూరల్: వివాహ వేడుకలో ఆహ్వానితుడిగా హాజరై కలివిడిగా తిరుతుగూ.. ఆపై బంగారు ఆభరణాలను దోచుకుపోయిన నిందితుడిని సర్పవరం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న సర్పవరం స్టేషన్ పరిధిలోని కమ్మ కల్యాణ మంటపంలో మధ్యాహ్నం వివాహ వేడుక జరిగింది. ఆ వేడుకలో సోఫాపై ఉంచిన హ్యాండ్ బ్యాగ్‌లోని 148గ్రాముల బరువుగల లాకెట్ కలిగిన మూడు బంగారు గొలుసులు మాయమవ్వడంతో బాధితుల ఫిర్యాదు మేరకు సర్పవరం స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీ హనుమంతరావు సూచనలలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టగా పిఠాపురం పట్టణానికి చెందిన కె.వీర శంకర్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచడంతో మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఏఎస్సై బలరాం, హెచ్‌సీలు సత్తిబాబు, గణేష్‌బాబు, సత్యనారాయణరాజు, వెంకటరత్నం, కానిస్టేబుళ్లు కీలకంగా పనిచేశారన్నారు.

పెంటాథ్లాన్ క్రీడలో ప్రతిభ

ఐ పోలవరం: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కాకినాడ గ్రౌండ్‌లో శుక్రవారం జరిగిన మోడరన్ పెంటాథ్లాన్ క్రీడల్లో మండల పరిధిలోని ఐ పోలవరం భైరవపాలెం జెడ్పీస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులు కె.విజయ్, బి.రాజు, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి పి.ధనశేఖర్ విజయం సాధించారన్నారు. వీరు ఈ నెల 30, 31 తేదీల్లో తిరుపతి కేంద్రంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడానికి బయలుదేరివెళ్లారని వ్యాయామ ఉపాధ్యాయులు షేక్‌మహ్మద్ షరీఫ్ తెలిపారు. అంతేకాకుండా హెచ్‌ఎం మల్లిపూడి వీరవెంకటసత్యనారాయణమూర్తి, సర్పంచ్ పెమ్మాడి బాబూరావు విద్యార్థులను అభినందించారు.

వడదెబ్బతో జాగ్రత్త

- ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- తగిన చర్యలు తీసుకోకుంటే ప్రాణాంతకమే
- ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి



పెదపళ్ల పీహెచ్‌సీలో వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అలమూరు/అంబాజీపేట/కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేసవికాలం ప్రారంభంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఏప్రిల్ ద్వితీయార్థంలో పెరగవలసిన ఉష్ణోగ్రతలు మార్చి నెలాఖరు నాటికే సుమారు 35 నుంచి 38 డిగ్రీల మధ్య నమోదు కావడం పరిస్థితికి అద్దం పడుతోంది. రోజు రోజుకు ఎండ తీవ్రత అధికం కావడంతో భానుడి భగభగలు మిన్నంటుతున్నాయి. ఈ వేసవి సీజన్ ముగిసే నాటికి సాధారణ ఉష్ణోగ్రతలు కంటే దాదాపు మూడు డిగ్రీల వరకూ అధికంగా నమోదు అవుతున్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీని వల్ల వృద్ధులు, చిన్నారులు, మహిళలు, రోగ నిరోధ శక్తి తగిన మోతాదులో లేని అనారోగ్య తీవ్రత ఉన్న వారు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది.


వడదెబ్బ అంటే..

వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత ఉన్న సమయంలో మానవుని శరీరంలోకి సంభవించే ఉష్ణోగ్రతలను తట్టుకోవడం లేదా నియంత్రించే శక్తి విఫలం కావడం వల్లే ఈ వడదెబ్బ సంభవిస్తుంది. సరియైన మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోకుండా ఉండటం కాని తీవ్ర వ్యాయామం లాంటి చురుకైన, శక్తికి మించి పనులు చేయడం వల్ల కాని ఈ వడదెబ్బ సంభవిస్తుంది. ఈ వేడిగాలుల వల్ల వడదెబ్బ (హీట్ స్ట్రోక్), శరీరంలో లవణాలు కోల్పోవడం (డీహైడ్రేషన్)తో కలిగే దుష్పరిణామాల వల్ల ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. వేడి వాతావరణంలో సంచరించేటప్పుడు అధిక ఉష్ణోగ్రత ముక్కు, కళ్ల ద్వారా శరీరంలోకి చేరుతుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత అసాధారణంగా 106 డిగ్రీల వరకూ అమాంతంగా పెరిగిపోయే అవకాశం ఉంటుంది. చర్మం పొడిబారి పోయి ముట్టుకుంటే కాలిపోయే పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో శరీరంలోని ప్రాథమిక అంతర్గత అవయవాలు సక్రమంగా పనిచేయకపోవడం వడదెబ్బకు కారణమవుతుంది. అదే సమయంలో నీరు, రక్త పరిమాణం తగ్గిపోవడం వల్ల రక్తపోటు కూడా సంభవించే ప్రమాదముంది. వేసవికాలంలో వడదెబ్బకు గురైన వ్యక్తి సత్వరమే ప్రాథమిక చికిత్సను తీసుకుని తగిన జాగ్రత్తలు, నివారణ చర్యలు పాటిస్తే ప్రాణాప్రాయం నుంచి తప్పించుకోవచ్చునని వైద్యారోగ్యశాఖ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏరియా, ప్రభుత్వ ఆస్పత్రుల్లోను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోను ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచి వైద్యారోగ్య సిబ్బంది ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తోంది.

వేసవిలో చేయాల్సినవి

- రోజుకు కనీసం 15 గ్లాసుల నీరు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
- పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తరచూ సేవించాలి.
- లేతరంగు కలిగిన తేలికగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. రెండు పూటలా స్నానం చేయాలి.
- ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పుడు బయటకు వెళితే గొడుగు లేదా టోపీ ధరించాలి. లేకుంటే తలకు రుమాలు చుట్టుకోవాలి.
- ఇంట్లో కిటికీలు తెరచి గదిలోకి గాలి వచ్చి చల్లబడే విధంగా చర్యలు తీసుకోవాలి.





లక్షణాలు

- శరీర ఉష్ణోగ్రత అమాంతంగా పెరిగిపోవడం
- చెమట పట్టకపోవడం, వణుకు పుట్టడం
- పాక్షికంగా ఫిట్స్ రావడం లేక అపస్మారక స్థితికి చేరుకోవడం.
- మగత నిద్ర రావడం, కలవరింతలు పలకడం.
- పెదవులు ఎండిపోయి నోరు పిడచకట్టుకు పోవడం

వేసవిలో చేయకూడనివి

- మండు వేసవిలో మధ్యాహ్నం 12 నుంచి సాయంకాలం 4 గంటల వరకూ బయట తిరగరాదు.
- సూర్య కిరణాలు, వేడిగాలులు నేరుగా తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- రహదారులపై విక్రయించే ఆహార పానీయాలు, రంగునీళ్లు సేవించరాదు. కలుషితమైన ఆహారం భుజించరాదు.
- ఎండవేళ్లలో శరీరంపై భారం పడే పనులు చేపట్టరాదు.
- మాంసాహారాన్ని తగ్గించాలి. మద్యం సేవించకుండా ఉండాలి.
- ముదురు, నలుపు రంగు దుస్తులు ధరించరాదు.
- వేడి అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా పని చేయరాదు, అలసట అనిపిస్తే సత్వరమే చల్లని ప్రదేశంలో సేద తీరాలి.

ప్రథమ చికిత్స ఇలా..



వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చి గాలి తగిలేలా చేయాలి. శరీరం సాధారణ స్థాయి ఉష్ణోగ్రతకు వచ్చే వరకూ మెత్తటి తడి గుడ్డతో తుడవాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ కాని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితికి వెళ్లిన రోగికి నీరు తాగించకూడదు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ వడదెబ్బ పట్ల జాగ్రత్తతో వ్యవహరించాలి.

– ఎం.సుమలత, అదనపు జిల్లా వైద్యాధికారి, కొత్తపేట.

వస్త్ర దుకాణాల్లో చోరీలకు పాల్పడే ముఠా పట్టివేత

పోలీసుల అదుపులో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు



ముఠాలోని ఇద్దరు సభ్యులు

పి.గన్నవరం: ఆటోలో వచ్చి వస్త్ర దుకాణాల్లో దుస్తుల చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషుల ముఠాను శుక్రవారం ముంగండ గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గత జనవరిలో 8 మంది మహిళలు ఇదే గ్రామానికి ఆటోలో వచ్చి ఒక వస్త్ర దుకాణంలో రూ.20 వేల విలువైన దుస్తులు దొంగిలించి పరారయ్యారు. మళ్లీ అదే బృందంలోని మహిళలు శుక్రవారం ముంగండకు వచ్చి మరొక వస్త్ర దుకాణంలోకి వెళ్లారు. వీరిని స్థానిక ఆటో డ్రైవర్లు, వ్యాపారులు గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో రోడ్లు, పంట పొలాల వెంబడి పారిపోతున్న దొంగలను స్థానిక వ్యాపారులు, గ్రామస్తులు, ఆటో డ్రైవర్లు వెంబడించి పట్టుకున్నారు.వివరాలు ఇలా ఉన్నాయి...

గత జనవరి 6వ తేదీ మధ్యాహ్నం ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న బండారు బొటిక్స్ అండ్ బ్యాగ్స్ షాపునకు ఆటోలో ఎనిమిది మంది మహిళలు వచ్చారు. ఆ సమయంలో షాపులో పనిచేసే అమ్మాయి ఉంది. దుస్తులు కొనుగోలు చేస్తున్నట్టు నటించి, రూ.20 వేల విలువైన డ్రెస్ మెటీరియల్‌ను కాళ్ల మధ్య పెట్టుకుని చోరీ చేశారు.

దొంగలు వెళ్లిన పోయిన తర్వాత యజమాని శ్రీనివాస్ వచ్చి దుస్తులు చోరీకి గురైనట్టు గుర్తించాడు. దీంతో స్థానికుల సాయంతో మోటారు సైకిళ్లపై వెళ్లి దొంగల కోసం గాలించినా ఫలితం లేదు. శుక్రవారం ఉదయం మళ్లీ అదే దొంగల ముఠా బొడ్డు నాగేశ్వరరావుకు చెందిన వస్త్ర దుకాణంలోకి వెళ్లారు. వీరిని గుర్తించిన స్థానిక ఆటో డ్రైవర్లు స్థానికులను అప్రమత్తం చేశారు. దీంతో ఎనిమిది మందిని పట్టుకుని ఆటోతో సహా పోలీసులకు అప్పగించారు. వీరిని విజయవాడ సమీపంలోని జి.కొండూరు మండలానికి చెందిన దేవరకొండ అంజమ్మ, జంగనాధం జువ్వాలమ్మ, కంపకాల కనకమ్మ, నల్లగొండ జువ్వాలమ్మ, మేడా రాజేశ్వరి, గరిక శకుంతల, పొన్నా వాసు, నామాల శ్రీనివాసరావులుగా గుర్తించారు. వీరిపై గతంలో కూడా కేసులు ఉన్నాయని ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. ఎస్సైతో పాటు క్రైమ్ బ్రాంచి పోలీసులు విచారణ చేపట్టారు.

ముద్రగడతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు భేటీ



కిర్లంపూడిలో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని కలిసిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్/కిర్లంపూడి: వైఎస్సార్ సీపీలో ఇటీవల చేరిన రాష్ట్ర కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంతో ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు కిర్లంపూడిలోని ముద్రగడ స్వగృహంలో శుక్రవారం ఉదయం భేటీ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించుకున్నారు. పార్టీలోకి ముద్రగడ లాంటి పెద్దలు రావడంతో అంతా కలిసి పనిచేసి, పార్టీ విజయానికి పాటు పడే అవకాశం వచ్చిందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా ముద్రగడకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కాకినాడలోని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను వేర్వేరుగా వారి ఇళ్లకు వెళ్లి కలిశారు. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం నిర్వహించే ప్రచారంపై ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు వారితో చర్చించారు.

జ్యోతుల కాలనీలో చోరీలు

10 కాసుల బంగారం, రూ.60 వేల నగదు అపహరణ



రెండో వీధిలో డాబాపై భాగంలో చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న ఎస్సై నాగార్జునరాజు

జగ్గంపేట: స్థానిక జ్యోతుల కాలనీలో గురువారం రాత్రి దొంగలు మూడు ఇళ్ల తాళాలు బద్దలు కొట్టి చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 10 కాసుల బంగారం, రూ.60 వేల నగదు అపహరణకు గురయింది. బాధితుల కథనం ప్రకారం జ్యోతుల కాలనీ మూడవ, ఐదవ వీధిలో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. మూడో వీధిలో అలమండ చందు ఇంటిపై భాగంలో వుంటూ తిరుపతి వెళ్లడంతో నాలుగు రోజులుగా ఇంటికి తాళాలు వేసి వున్నాయి. ఐదవ వీధిలో అడపా శ్రీనివాస్ (ఆటో డ్రైవర్) ఇంటికి తాళాలు వేసి బంధువులకు అనారోగ్యంగా వుందని వెళ్లాడు. అదే వీధిలో మరో ఇంటిలోను ఎవరు లేకపోవడాన్ని దొంగలు గమనించారు. గురువారం అర్ధరాత్రి ఇద్దరు లేక ముగ్గురు చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. అడపా శ్రీనివాస్ ఇంట్లో పది కాసుల బంగారం, రూ.60వేల నగదు అపహరించారు. మిగిలిన రెండు ఇళ్లలోను కొద్దిపాటి నగదు, వస్తువులు చోరీకి గురిఅయినట్లు గుర్తించారు. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది.

రేపు అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: పదవ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ(మెయిన్స్), జేఈఈ(అడ్వాన్స్‌డ్), నీట్ వంటి జాతీయ పరీక్షలపై ఆదివారం ఉదయం 10.00 గంటలకు రాజమహేంద్రవరం కాతేరులో గల తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకొనే విద్యార్థులు వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. తిరుమలఈడీయూ.కామ్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నిపుణులైన అధ్యాపకులు సలహాలు, సూచనలు తెలియజేస్తారన్నారు. వివరాలకు 7997071672 ఫోన్ నంబరులో సంప్రదించాలని తిరుమలరావు కోరారు.

108లో శిశువు జననం



108 వాహనంలో జన్మనిచ్చిన తల్లి

ఏలేశ్వరం: మండలంలోని పరిమితడక గ్రామానికి చెందిన జి.చిట్టమ్మ శుక్రవారం 108 వాహనంలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. చిట్టమ్మకు నెలలు నిండడంతో ఆసుపత్రికి తీసుకువస్తుండగా పరిమితడక, జె.అన్నవరం గ్రామాల మధ్యలో మూడో కాన్పుగా మగ బిడ్డను ప్రసవించింది. తల్లీ బిడ్డా ఏలేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

మహిళల కోచ్‌లో మగవారు ప్రయాణిస్తే చర్యలు



నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: రైళ్లలో ప్రయాణించే సమయంలో దివ్యాంగులు, మహిళలకు కేటాయించిన ప్రత్యేక బోగీల్లో మగవారు ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య హెచ్చరిక జారీ చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో విజయవాడ సీనియర్ డీఎస్‌ఈ వల్లేశ్వర బాపూజీ ఆదేశాలతో పలు రైళ్లలో మహిళలకు కేటాయించిన ప్రత్యేక కోచ్‌లను జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తో కలసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మూడు రైళ్లలో నిర్వహించిన తనిఖీలలో మహిళలకు కేటాయించిన కోచ్‌లలో ప్రయాణం చేస్తున్న 17 మంది పురుషులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి రాజమహేంద్రవరం రైల్వే కోర్టుకు తరలించారు. భవిష్యత్‌లో న్యాయస్థానం నుంచి సమన్లు వచ్చినప్పుడు కోర్టుకు హాజరు కావాలనే సూచనలతో వ్యక్తి గత బెయిల్‌పై విడిచి పెట్టినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ స్పెషల్ డ్రైవ్ నిరంతరం కొనసాగనున్నదన్నారు. రైలు ప్రయాణంలో మహిళలు, దివ్యాంగులకు కేటాయించిన కోచ్‌లలో ఇతరులు ఎట్టి పరిస్థితుల్లో ప్రయాణించవద్దన్నారు. నిబంధనలు మీరితే కేసులు తప్పవన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్

చాగల్లు: అప్పుల బాధ తట్టుకోలేక ఒక వ్యక్తి పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చాగల్లుకు చెందిన బత్తిన శ్రీనివాస్ (45) వ్యవసాయ పని చేసుకుని జీవిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం వాయిదాల పద్ధతిలో వారం వారం చెల్లించేలా రూ.4 లక్షలు ఫైనాన్స్ కంపెనీ వద్ద అప్పుగా తీసుకున్నాడు. రెండు వారాల క్రితం శ్రీనివాస్ పొలం పని చేస్తుండగా కాలుజారి పొలంలో పడడంతో చేతికి ఫ్రాక్చర్ అయింది. అప్పటి నుంచి పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. పనికి వెళ్లకపోవడంతో వాయిదాలు కట్టడానికి డబ్బు లేదు. అప్పు ఇచ్చిన వారు వాయిదాలు కట్టకపోతే అల్లరి చేస్తారేమోనన్న భయంతో తన ఇంటిలో ఉన్న కలుపు మందు తాగాడు. అతని కుమారుడు వెంటనే ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతిచెందాడు. కుమారుని ఫిర్యాదుపై చాగల్లు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవిపంది హల్‌చల్

పలువురిపై దాడి.. ఇద్దరికి గాయాలు



పటవలలో అడవిపంది దాడిలో గాయపడ్డ నాగబాబు

తాళ్లరేవు: పటవల పంచాయతీలో శుక్రవారం అడవిపంది హల్‌చల్ చేసింది. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో అడవిపంది అత్యంత వేగంగా సంచరించడంతో స్థానికులు భయపడ్డారు. అడవిపందిని నియంత్రించేందుకు పలువురు యువకులు ప్రయత్నించడంతో వారిపై దాడి చేసింది. ఈ దాడిలో పటవల గ్రామానికి చెందిన మాసగిరి నాగబాబు తీవ్ర గాయాలపాలవగా, మరొక వ్యక్తికి చేతిపై స్వల్పగాయాలయ్యాయి. బైక్‌పై వెళుతున్న నాగబాబుపై ఒక్కసారిగా దాడి చేయడంతో అతని ఎడమ తొడ మీద తీవ్ర గాయమైంది. స్థానికులు హుటాహుటిన అతన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. అడవి పంది సంచారాన్ని స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆచూకీ తెలియ రాలేదు. పటవల నుంచి మట్లపాలెం మీదుగా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

కాపర్ వైర్ చోరీ చేసిన వ్యక్తికి రిమాండ్

గండేపల్లి: కాపర్ వైర్ చోరీ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని పెద్దాపురం కోర్టుకు తరలించినట్లు గండేపల్లి ఎస్సై ఎస్‌రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఏలేశ్వరం పట్టణానికి చెందిన పెంట్ర ప్రసాద్ అతని బంధువైన పెంట్ర రవితో కలిసి మండలంలోని జెడ్.రాగంపేట, ఎర్రంపాలెం, పి.నాయకంపల్లి గ్రామాల్లోని పొలాల్లో వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించిన 12 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి దానిలో కాపర్ వైర్‌ను దొంగిలించారు. శుక్రవారం వీరిద్దరు కాపర్ వైర్‌ను విక్రయించేందుకు రాజమహేంద్రవరం వస్తుండగా గండేపల్లి వచ్చేసరికి పెంట్ర ప్రసాద్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద కాపర్ వైర్‌తో పాటు 30 లీటర్ల నాటు సారాను సీజ్ చేసినట్లు తెలిపారు. పెంట్ర రవి పరారీలో ఉన్నాడని, అతనిని త్వరలో పట్టుకుంటామన్నారు. ప్రసాద్‌ను రిమాండ్ కోసం పెద్దాపురం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.


సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ దుర్గాప్రసాద్‌రావుకు సత్యదేవుని చిత్రపటాన్ని అందచేస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం రాత్రి రత్నగిరి పై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. వారికి ఆలయం వద్ద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలు, సత్యదేవుని చిత్రపటాన్ని దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అందజేశారు. జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు వెంట పలువురు న్యాయాధికారులు, పోలీస్, దేవస్థానం అధికారులు ఉన్నారు.

నాటి మంత్రుల సలహాదారు శేషయ్య మృతి



కర్రి శేషయ్య

కాకినాడ సిటీ: జిల్లా పరిషత్ ఉద్యోగిగా, కేంద్ర, రాష్ట్ర మంత్రుల సలహాదారుగా వ్యవహరించిన కర్రి శేషయ్య (90) శుక్రవారం కాకినాడలో మరణించారు. ఈయన జిల్లా పరిషత్ ఉద్యోగిగా ఉంటూ కేంద్ర మంత్రి మల్లిపూడి పళ్లంరాజు (సీనియర్) వద్ద వ్యక్తిగత సలహాదారునిగా పని చేశారు. ఆ తరువాత రాష్ట్ర మంత్రులు తోట రామస్వామి, సంగిత వెంకటరెడ్డి, కేంద్ర మంత్రి మల్లిపూడి శ్రీరామసంజీవరావుల వద్ద సలహాదారునిగా పని చేశారు. ఎవరు ఏ సహాయం అడిగినా చేస్తూ ఎందరికో ఉద్యోగవకాశాలు కల్పించి, ఎందరో జీవితాల్లో వెలుగులు నింపారు కర్రి శేషయ్య. సురుచి స్వీట్స్ అధినేత మల్లిబాబు శేషయ్య అల్లుడు. ఈయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చురుగ్గా ధ్వజస్తంభం తొలగింపు పనులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని నూతన బంగారు ధ్వజస్తంభం ఏర్పాటుకు ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం తొలగింపు కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. శాస్త్రోక్తంగా ఈ ధ్వజస్తంభం తొలగింపునకు చేపట్టాల్సిన 'కళాప్రకర్షణ' (తొలగింపు) కార్యక్రమం గురువారం దేవస్థానం విశ్రాంత వేద పండితులు బ్రహ్మశ్రీ ముష్టి కామశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన విషయం విదితమే. శుక్రవారం నుంచి తొలగింపు పనులను ఇంజినీరింగ్ సిబ్బంది వేగవంతం చేశారు. తొలుత ధ్వజస్తంభం పీఠం చుట్టూ ఉన్న కట్టడాన్ని తొలగిస్తున్నారు. ఈ కట్టడం గ్రానైట్ రాతితో గతంలో కళాత్మకంగా నిర్మించారు. దీంతో ఆ గ్రానైట్ రాళ్లు పాడవకుండా వాటిని తీసి భద్రపరుస్తున్నారు. పీఠ భాగంలో గల కట్టడాన్ని తొలగించిన అనంతరం ధ్వజస్తంభం చుట్టూ ఉన్న వెండి తొడుగును తొలగిస్తారు. తరువాత పునాదిని తవ్వి ధ్వజస్తంభాన్ని పైకి లేపుతారని అధికారులు తెలిపారు. ఈ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని దేవస్థానం ఈఓ కే.రామచంద్రమోహన్ ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన ఈ పనులను పరిశీలించారు. సత్యదేవుని ఆలయానికి రూ. నాలుగు కోట్లు వ్యయంతో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేయడానికి నెల్లూరుకు చెందిన దాత ముందుకు వచ్చారు. ఏప్రిల్ 22న నూతన ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతిష్ఠ అనంతరం బంగారు రేకు తాపడం చేస్తారు. ఆలయ ఏఈఓ కృష్ణారావు, డీఈ ఉదయ్, బీఎస్ రాంబాబు పాల్గొన్నారు.